క్లుప్తంగా

బాలకృష్ణకు చైర్‌పర్సన్ సత్కారం



బాలకృష్ణను సత్కరిస్తున్న సత్యనాగేంద్రమణి, సత్యనారాయణ దంపతులు, ఇతర నేతలు

ముమ్మిడివరం/అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణను అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, సత్యనారాయణ దంపతులు సోమవారం దుశ్శాలువాతో సత్కరించారు. పితాని స్వగృహంలో కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. చైర్‌పర్సన్‌తో పాటు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుధా గణపతి, నాయకులు ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి ఉన్నారు.

పొన్నాడకు సుబ్బు సత్కారం



పొన్నాడను సన్మానిస్తున్న ఏడిది సుబ్బు

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ ఆర్టీఐ జాయింట్ సెక్రటరీగా నియమితులైన ఏడిది సుబ్బు సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను ఆయన స్వగృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొన్నాడను దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. పార్టీ అభివృద్ధికి తాను చేస్తున్న సేవలకు గుర్తింపుగా అదనపు బాధ్యతలు అప్పగించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపినట్టు సుబ్బు ఇక్కడ వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కాశీహనుమంతరావు, ఏడిది లక్ష్మణరావు, గెద్దాడ గుణవేణుకుమార్, బొజ్జా అప్పారావు, నందిక ధనరాజు, వర్షాల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

15 కిలోల కుళ్లిన చేపలు స్వాధీనం



మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ రవివర్మ తదితరులు

ముమ్మిడివరం: నగర పంచాయతీ చేపల మార్కెట్‌లో కుళ్లిన చేపలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం కమిషనర్ పి.రవివర్మ తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన 15 కిలోల కుళ్లిన చేపలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని మున్సిపల్ ట్రాక్టర్‌లో వేసి.. డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అధిక వర్షాలు పడుతుండడంతో పాటు, వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో మాంసం, చేపల విక్రయదారులు నాణ్యమైన సరకును విక్రయించాలని నిర్దేశించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నీలిమ



నీలిమకు ప్రశంసాపత్రం అందజేస్తున్న యాజమాన్యం

ముమ్మిడివరం: కర్నూలులో ఇటీవల నిర్వహించిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక బాలాజీ కాన్వెంట్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని యనమదల నీలిమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైంది. వచ్చే నెల ఏడు, తొమ్మిది తేదీల్లో జరిగే జాతీయ పోటీల్లో నీలిమ పాల్గొంటుందని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పీవీ రామరాజు తెలిపారు. ప్రతిభ కనబర్చిన నీలిమను స్కూల్ కరస్పాండెంట్ పి.సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

తొలకరి సాగును నష్టపోతున్నాం

ఉప్పలగుప్తం: మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు దిగక ముంపు నీటితో ఏటా తొలకరి సాగును నష్టపోతున్నామని పలు గ్రామాల రైతులు ఈస్ట్రన్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌కు విన్నవించారు. మండలంలోని డ్రెయిన్లను డీఈఈ ఎంవీవీ కిషోర్, నీటి సంఘాల చైర్మన్లతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. కూనవరం మొగ పాయింట్‌ను త్వరితగతిన తవ్వే చర్యలు తీసుకోవాలని, లేకపోతే సాగు చేయలేమని రైతులు వివరించారు. పల్ల భూముల్లో, డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే వలకట్లు తొలగించే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దివాకర్‌కు వినతి పత్రం అందించారు.

గొంతెత్తి.. కదం తొక్కి..

- నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రణభేరి
- కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా
- భట్నవిల్లి నుంచి అమలాపురం వరకు ర్యాలీ



నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చి, రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలు హరిస్తున్న కూటమి నాయకుల వైఖరికి, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా అమలాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు రణభేరి మోగించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అమలాపురంలో ఆందోళన చేశారు. తొలుత భట్నవిల్లిలో పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి, సుమారు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. అమలాపురంలో నల్ల వంతెన వద్ద ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. నకిలీ మద్యం గుట్టును తేల్చేందుకు వెంటనే రాష్ట్రవ్యాప్తంగా వైన్ షాపులు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్టు షాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేపట్టి, దీని వెనుక ఉన్న కీలక వ్యక్తులను అరెస్టు చేయాలని, నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి, వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, అల్లవరం మండలం కొమగిరిపట్నంలో ఇటీవల అక్రమ మద్యం తయారు చేస్తున్న కుటీర పరిశ్రమను అధికారులు స్వాధీనం చేసుకుని, 8 మందిని అరెస్టు చేశారన్నారు. లక్షలాది రూపాయల విలువైన నకిలీ మద్యం తయారీ సామగ్రిని పట్టుకుని, అసలు దోషులను అరెస్టు చేయలేదన్నారు. పాలకొల్లులో నకిలీ మద్యం పరిశ్రమను నడుపుతున్నారని ఆరోపించారు. దీని వెనకున్న ముఖ్య నాయకులను అధికారులు క్లుప్తంగా విచారణ చేసి వదిలి వేస్తున్నారన్నారు. నకిలీ మద్యాన్ని అరికట్టి, ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

నకిలీ మద్యంతో సంపదా..?

రాష్ట్రానికి సంపద సృష్టిస్తానని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు.. టీడీపీ నాయకులకు నకిలీ మద్యం ద్వారా సంపద సృష్టిస్తున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ధ్వజమెత్తారు. నకిలీ మద్యాన్ని తాగి ప్రజలు చనిపోతున్నా, వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేశారన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని తయారు చేసి ప్రజల ప్రాణాలు హరిస్తున్నారన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యాన్ని మంచినీటిలా సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యమిస్తుంటే, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్ఈసీ సభ్యులు కుడుపూడి భారత్‌భూషణం, కుడుపూడి వెంకటేశ్వరబాబు, కాశీ బాలమణికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, పార్టీ అమలాపురం పట్టణ, రూరల్, అల్లవరం అధ్యక్షులు సంసాని నాని, గుర్రల చిరంజీవిరావు, కొనుకు బాబూజీ, జిల్లా అధికార ప్రతినిధి సుధా గణపతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దొంగ నాగసుధారాణి, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి గోవ్వాల రాజేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రటరీ సరళ్ల రామకృష్ణ, బూత్ కమిటీల రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, జిల్లా కార్యదర్శి కముజు రమణ, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి శ్రీను, చొల్లంగి సుబ్బిరామ్, రేవు శ్రీను, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, నాగారపు వెంకటేశ్వరరావు, చిత్రపు రామకృష్ణ, గోపిరాజీ రమేష్, కల్వకోలను ఉమా, నాయకులు ఈతకోట శ్రావణ్, నాతి శ్రీనివాసరావు, భారీ ఎత్తున మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీకాంత్‌ను కలసిన సూర్యప్రకాష్



సూర్యప్రకాష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లా సూర్యప్రకాష్ పార్టీ ఆర్టీఐ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో సోమవారం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను డాక్టర్ శ్రీకాంత్ దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నిర్దేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, నాయకులు సలాది సతీష్, నల్లా నాయుడు, కోరుకొండ కిరణ్, నల్లా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంగళ, శుక్రవారాల్లో గ్రీవెన్స్

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రజల నుంచి వినతులను మంగళ, శుక్రవారాల్లో స్వీకరించనున్నట్లు ఆర్ఏవో అంకిత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఆయా సమయాల్లో ప్రజలు వినతులివ్వాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహ దిమ్మకు టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలపై ఫిర్యాదు



కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఇన్‌చార్జి డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న బులినాని

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ శ్రేణుల మనోభావాలు దెబ్బతీసేలా అమలాపురం హైస్కూలు సెంటర్ వద్దనున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం దిమ్మ చుట్టూ టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు కట్టారని పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకట చంద్రశేఖర్ (బులినాని) కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేశారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు బులినాని స్వయంగా హాజరై, ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, ఎస్పీ రాహుల్ మీనాకు వినతిపత్రాలు అందించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు కూడా వినతిపత్రం అందించారు. కొత్తగా టీడీపీలోకి వచ్చిన కొందరు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా.. ఏదో సందర్భాన్ని అడ్డుపెట్టుకుని పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు నిబంధనలకు విరుద్ధంగా ఆ విగ్రహం దిమ్మకు కడుతున్నారని చెప్పారు. ఇలా గొడవలు సృష్టించి ఏదోలా తమను పోలీసు కేసుల్లో ఇరికించేలా టీడీపీ నాయకులు కాలు దువ్వుతున్నారని ఆరోపించారు. ఆయా పరిణామాలపై విచారణ జరిపించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సీజేఐపై దాడికి ఎమ్మార్పీఎస్ నిరసన

- కలెక్టరేట్ వద్ద నల్ల జెండాల ప్రదర్శన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం రూరల్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ అమలాపురం కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల జెండాలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంఘ జిల్లా ఇన్‌చార్జి కేబీ మధు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సీజేఐపై జరిగిన దాడిని ఖండిస్తూ, రాకేశ్ కిషోర్‌పై దేశద్రోహ నేరం కింద కేసు నమోదు చేయాలని, ఇతని వెనకున్న శక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు నవరపు భైరవమూర్తి, జిల్లా అధికార ప్రతినిధులు నూతుకుర్తి సత్యనారాయణ, నేదునూరి రాజేష్,, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఆకుమర్తి మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు వీధి చిరంజీవి, జిల్లా కోశాధికారి ఖండవల్లి ఎలియా, అమలాపురం నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుమర్తి రమేష్, నేదునూరి నతానియేలు, చుట్టుగుళ్ల నీలకంఠం ఆకుమర్తి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల స్వదేశీ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రదర్శనను పరిశీలిస్తున్న డీపీవో శాంతిలక్ష్మి, కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన స్వదేశీ వస్తువుల ప్రదర్శన సోమవారం ఏర్పాటైంది. దాదాపు 40 స్టాళ్లను ఏర్పాటు చేశారు. డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు, వాటి అమ్మకాలూ జోరుగా సాగాయి. ముఖ్య అతిథులుగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) డి.శాంతిలక్ష్మి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పెంచలయ్య, సీటీవో జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, ఏసీటీవో ఇళ్ల భక్తవత్సలం, మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, మున్సిపల్ వార్డు సచివాలయ కార్యదర్శి బండి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య శాస్త్రి సేవలు ప్రశంసనీయం



సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ గోపి మూర్తి తదితరులు

ఐ.పోలవరం: ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వాకపల్లి బాలకృష్ణ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి సేవలు ప్రశంసనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి కొనియాడారు. ఐ పోలవరం మండలం మురమళ్ల పితానివారిపాలెం మండల ప్రజా పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్లో హెచ్‌ఎంగా పనిచేసిన శాస్త్రి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు, ఎన్‌సీసీలో ఎంతో మందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య శాస్త్రి, సరళ దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మోర్తా రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తక్షణం పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి



నూతన కమిటీ ప్రతినిధులు

ముమ్మిడివరం: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్టీయూ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జి.ఉదయ భాస్కరరావు డిమాండ్ చేశారు. ముమ్మిడివరంలో సోమవారం జరిగిన మండల శాఖ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, తక్షణం పీఆర్‌సీ నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ నియామకం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా జి.ఉదయ భాస్కరరావు, అధ్యక్షుడిగా వీవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జె.శ్రీధర్, ఆర్థిక కార్యదర్శిగా ఎ.పార్థశ్రీనివాస్, అదనపు ప్రధాన కార్యదర్శిగా బి.విజయలక్ష్మి, అభయ్ కన్వీనర్‌గా జె.సూర్యనారాయణ, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా ఎ.సుబ్రహ్మణ్యం, మహిళా కన్వీనర్‌గా పి.దుర్గమ్మ తదితరులు నియమితులయ్యారు.

ప్రతిష్టాత్మకంగా కార్తిక మాసోత్సవాలు

- వీరేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఆలయ చైర్మన్, ఈవోల సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న చైర్మన్ రామకృష్ణంరాజు, ఈవో సత్యనారాయణ

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు జరిగే కార్తిక మాసోత్సవాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు అన్నారు. సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణతో కలిసి ఆలయ అర్చక, పురోహిత బృందంతో సోమవారం కార్తిక మాస ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో సత్యనారాయణ మాట్లాడుతూ, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరుకానున్న భక్తుల కోసం చేపట్టనున్న ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. కార్తిక సోమవారాల్లో దాతల సహకారంతో పగలు భక్తులకు అన్న ప్రసాద వితరణ, నెల రోజులూ ఉచిత ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. పర్వదినాల్లో భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపం వద్ద అభిషేకాలు నిర్వహిస్తామని, భక్తులు తిలకించేందుకు వీలుగా నెల రోజులు ప్రత్యక్ష ప్రసారానికి స్క్రీన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎప్పటిలాగే రూ.మూడు వేల టికెట్ తీసుకున్న భక్తులకు నెల రోజులూ స్వామివారి నిజరూప లింగానికి పంచామృతాభిషేకం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు దేవస్థానం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ ఐదున పౌర్ణమి జ్వాలా తోరణం, ఆఖరు రోజు అమావాస్యకు దీపోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, యనమండ్ర సత్యసీతారామ శర్మ, పేటేటి శ్యామలకుమార్, పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి, వేద పండితులు గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, స్వస్తి వాచకులు నాగాభట్ల రవిశర్మ పాల్గొన్నారు.

కంటి‘పాప’కే కంటగింపైతే..

- పెంచిన కుమార్తెకు ఆస్తి రాసిచ్చిన వృద్ధ దంపతులు
- ఇప్పుడు కనీసం పట్టించుకోని వైనం
- కలెక్టర్‌ను ఆశ్రయించిన పండుటాకులు



వెంకటనర్సయ్య, లక్ష్మి దంపతులు

అమలాపురం రూరల్: కడుపున పుట్టకపోయినా కన్న కూతురుగా చూసుకున్న ఆ వృద్ధ దంపతులకు ఓ పెంచిన కుమార్తె అనుకోని షాక్ ఇచ్చింది. వారు కష్టపడి సంపాదించిన రెండెకరాలకు పైబడి స్థిరాస్తిని తన పేరున రాయించుకుని ముఖం చాటేసింది. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుందనుకున్న ఆ కంటిపాపే.. కంట్లో పొడిస్తే ఆ పండుటాకులు నిశ్చేష్టులయ్యారు. దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్న ఆ వృద్ధ దంపతులు.. తమ కుమార్తెకు రాసిచ్చిన భూమిని తిరిగి తమకు అప్పగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లవరం మండలం మొగళ్లమూరుకు చెందిన వాసర్ల వెంకటనర్సయ్య, లక్ష్మి దంపతులు అండమాన్‌లో టైలరింగ్ పనిచేసి 2.18 ఎకరాలు కూడబెట్టారు. పిల్లల్లేని లోటు పూడ్చుకునేందుకు బంధువుల ఇంట్లోని ఆడపిల్లను పెంచి పెద్ద చేశారు. కంటిపాపలా చూసుకున్న ఆమెకు అన్ని లాంఛనాలతో వివాహం కూడా జరిపించారు. ఈక్రమంలోనే తండ్రి వెంకటనర్సయ్య పేరున ఉన్న 2.18 ఎకరాల భూమిని తన పేరున రాసివ్వాలని పెంచిన కుమార్తె అడగడంతో, మమకారంతో ముందూవెనుకా ఆలోచించకుండా రాసిచ్చారు. ఆ తర్వాత వీరుంటున్న ఇంటినీ తన పేరున రాసివ్వాలని కోరింది. ఇలాఉండగా అండమాన్‌లో లీజు ప్రాతిపదికన తమ పేరున ఉన్న షాపులను కుమార్తె, ఆమె భర్త స్వాధీనం చేసుకుని, వాటి అద్దెలనూ తీసుకుంటున్నారు. చివరకు వృద్ధ దంపతులు రోజులు వెళ్లదీసేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తింది. కుమార్తె వారిని చాలా కాలంగా చూడకపోగా, అనారోగ్యం పాలైనా కనీసం పట్టించుకోవడం లేదు. వృద్ధాప్యంలో ఆలనాపాలనా చూస్తుందన్న నమ్మకంతో ఆస్తిని అప్పగించినా.. తమను కుమార్తె పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఈ నేపథ్యంలోనే తమ కుమార్తె పేరున రాసిన దాన సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి, తమ పేరున తిరగరాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

సబ్బతి కుటుంబానికి పరామర్శ



సబ్బతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరాజు తదితరులు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ శివారు మూలకొంపలు గ్రామంలో సబ్బతి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు తదితరులు పరామర్శించారు. వార్డు సభ్యుడు సబ్బతి రామకృష్ణ కుమారుడు అరవింద్(20) ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, నాయకులు కావూరి వెంకటేశ్వరరావు, దడాల ప్రసాద్, బళ్ల ఏసు, శీలం గోవిందు, పిల్లారాయుడు, దడాల హరీష్, ఉండ్రు హరిబాబు, కోరుకొండ చంటి, పెయ్యాల కొండబాబు తదితరులు ఉన్నారు.

బాణసంచా అక్రమ తయారీదారు అరెస్ట్



బాణసంచా సామగ్రితో నిందితుడు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలో బాణసంచా అక్రమంగా తయారు చేస్తున్న వైవీవీ సత్యనారాయణను అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎస్సై సత్యనారాయణ బృందం సోమవారం బాణసంచా అక్రమ తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు నిర్వహించారు. సుంకరపాలెం తోటవారి వీధిలో అనుమతి లేకుండా బాణసంచా తయారు చేస్తున్న కేంద్రంపై దాడి చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకుని కేంద్రాన్ని సీజ్ చేశారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ, వార్డు వలంటీర్ల సంఘ సభ్యులు

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లను విధుల్లోకి తీసుకుని, నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామ వార్డు వలంటీర్లకు బకాయి వేతనాలు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసువెళ్లినా పట్టించుకోవడం లేదని వారు అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నెలకు రూ. 5 వేలు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం ప్రభుత్వం వస్తే రూ. 10 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీ మేరకు తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. ఈ ఆందోళనకు సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు.

కలెక్టర్‌తో యూఏఈ ప్రతినిధుల భేటీ

అమలాపురం రూరల్: గోల్డెన్ సహిన్, అల్ సహీన్ గ్రూప్ అబుదాబీ ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో భేటీ అయ్యారు. యూఏఈలో వివిధ ఉద్యోగాల కోసం కంపెనీ చేస్తున్న సేఫ్ లీగల్ మైగ్రేషన్ కార్యకలాపాలను వివరించారు, ఈ జిల్లా నుంచి కూడా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వారు తెలిపారు. కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందంతో పూర్తి వివరాలు చర్చించాలని కలెక్టర్ వారికి నిర్దేశించారు. కార్యక్రమంలో గోల్డెన్ సహిన్, అల్ సహీన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్లా బిన్ ఆలీ బస్లీబ్, సుధీష్ణ సంపతీ రావ్, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు, మేనేజర్ గోళ్ల రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భారీ వర్షంతో చెరువులైన రోడ్లు



వర్షపు నీటితో నిండిన విష్ణాలయం వీధి

యానాం: పట్టణంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా 11 గంటల వరకు కురిసిన భారీ వర్షంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిత్యం జన సంచారంతో కిటకిటలాడే పిల్లారాయవీధి, కామిశెట్టివారివీధి, యానాం–ద్రాక్షారామ రహదారి, బైపాస్ సెంటర్, స్టేట్‌బ్యాంకు వీధి, విష్ణాలయం వీధి తదితర ప్రాంతాలు చెరువులను తలపించాయి. అలాగే సావిత్రీనగర్, గిరియాంపేట తదితర తీర గ్రామాల్లో వీధులు వర్షపు నీటితో నిండిపోయాయి.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి, చినగాడవిల్లి గ్రామాల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బృందం సోమవారం పర్యటించింది. బృంద సభ్యులు ఉమేష్‌కుమార్, మయూర్‌వర్మ గ్రామాల్లో వివిధ పనుల స్థితిగతులను తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పెన్షన్లు, డ్వాక్రా, ఇంటి రుణాల నిధులపై ఆరా తీశారు. చినగాడవిల్లిలో కాలువ గట్టుపై నిర్మించిన సీసీ రోడ్డుకు రక్షణ గోడ ఎందుకు నిర్మించలేదని పంచాయతీరాజ్ సిబ్బందిని ప్రశ్నించారు. రోడ్డు వరకే తమ పరిధి అని, కాలువ రిటైనింగ్ వాల్ ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందని వారు సమాధానమిచ్చారు. వారి వెంట సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.